సీఎం జగన్ మార్గదర్శకత్వంలో అభివృద్ధి

- మేయర్ గొలగాని హరివెంకటకుమారి
- నియోజకవర్గంలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన



పైప్‌లైన్ పనులకు శంకుస్థాపన చేస్తున్న మేయర్ హరివెంకటకుమారి, ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి



జీవీఎంసీ 73వ వార్డులో శంకుస్థాపన చేస్తున్న మేయర్ హరి వెంకటకుమారి, ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, తదితరులు



జీవీఎంసీ 72వ వార్డులో శంకుస్థాపన చేస్తున్న మేయర్ హరి వెంకట కుమారి, ఎమ్మెల్యే నాగిరెడ్డి, సమన్వయకర్త ఉరుకూటి రామచంద్రరావు

గాజువాక : జీవీఎంసీ 73వ వార్డులో రూ.1.60 కోట్ల వ్యయంతో మౌలిక వసతుల కల్పనకు జీవీఎంసీ మేయర్ గొలగాని హరివెంకట కుమారి శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి మార్గదర్శకత్వంలో విశాఖ నగరాన్ని ఆదర్శంగా అభివృద్ధి చేస్తున్నామన్నారు. అందులో భాగంగానే అన్ని వార్డుల్లోనూ మౌలిక వసతులు అందుబాటులోకి తీసుకొచ్చామన్నారు. కోట్లాది రూపాయల వ్యయంతో ప్రతి వార్డులోనూ అభివృద్ధి పనులు శరవేగంగా జరుగుతున్నాయన్నారు. గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గంలో అనేక అభివృద్ధి పనులకు మేయర్ హరి వెంకట కుమారి అందిస్తున్న సహకారం అభినందనీయమన్నారు. విశాఖలో ఇలాంటి అభివృద్ధి కొనసాగడం కోసం, అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించడం కోసం ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని మరోసారి ఆశీర్వదించాలని కోరారు. వార్డు కార్పొరేటర్ భూపతిరాజు సుజాత మాట్లాడుతూ కోటి రూపాయలతో సనత్‌నగర్‌లో గెడ్డ రక్షణగోడ, సింహగిరి కాలనీలో రూ.30 లక్షలతో సీసీ రోడ్డు, రూ.30 లక్షలతో సీసీ డ్రైన్ నిర్మాణ పనులు చేపట్టనున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు కంది పైడినాయుడు, ఆలీ, సంతోష్, కిరణ్, రామకృష్ణరాజు, బొత్స సత్యనారాయణ, గొరుసు సత్యం రెడ్డి, కర్రి వెంకట శివ ప్రసాద్, వి.వి.రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జీవీఎంసీ 72వ వార్డులో...

జీవీఎంసీ 72వ వార్డు పరిధి మెహర్‌నగర్, చినగంట్యాడ గ్రామాల్లో రూ.38.57 లక్షలతో చేపట్టనున్న సీసీ రోడ్డు, సీసీ కాలువల నిర్మాణానికి జీవీఎంసీ మేయర్ గొలగాని హరి వెంకట కుమారి, గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. వైఎస్సార్‌సీపీ వార్డు నాయకుడు సిరట్ల శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆ పార్టీ గాజువాక నియోజకవర్గ సమన్వయకర్త ఉరుకూటి రామచంద్రరావు (చందు), కార్పొరేటర్లు స్టాలిన్, భూపతిరాజు సుజాత, నాయకులు ఉరుకూటి అప్పారావు, మంత్రి శంకర నారాయణ, రామకృష్ణ, పి.శ్రీనివాస్, సత్యనారాయణ, ధనలక్ష్మి, మధు, విజయ, నాగమణి, ఆదిలక్ష్మి, వరలక్ష్మి, వాసవి నాయుడు, భవాని, సాయి, డేవిడ్, చందు, పద్మావతి, శ్రీరాములు, దుర్గారావు, నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

రూ.2.90 కోట్లతో పైపులైన్‌కు శంకుస్థాపన

పెదగంట్యాడ: రానున్న వేసవిని దృష్టిలో పెట్టుకుని అన్ని ప్రాంతాలకు తాగునీటిని అందించేందుకు చర్యలు చేపట్టామని మేయర్ గొలగాని హరివెంకటకుమారి తెలిపారు. జీవీఎంసీ 64వ వార్డు ధారవీధి నుంచి గంగవరం వరకూ రూ.2.90 కోట్లతో చేపట్టనున్న పైప్‌లైన్ పనులకు ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డితో కలిసి శుక్రవారం ఆమె శంకుస్థాపన చేశారు.

ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలో విశాఖ నగరాన్ని అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. 64వ వార్డులోని గంగవరం ప్రాంత ప్రజల దాహార్తిని తీర్చేందుకు ఇప్పుడు చేపడుతున్న పైప్‌లైన్ పనులను త్వరితగతిన పూర్తి చేస్తామన్నారు. ఎమ్మెల్యే నాగిరెడ్డి మాట్లాడుతూ గాజువాక నియోజకవర్గంలో దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరించామన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు దల్లి గోవింద్, భూపతిరాజు సుజాత, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు ధర్మాల శ్రీను, జీవీఎంసీ అధికారులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

ఏపీఎస్‌ఈబీ ఇంజినీర్స్ అసోసియేషన్ ఎన్నిక ఏకగ్రీవం



రాంబాబు, కార్యదర్శి

గాజువాక : ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఎలక్ట్రికల్ బోర్డు ఇంజినీర్స్ అసోసియేషన్‌కు శుక్రవారం నిర్వహించిన కార్యవర్గ ఎన్నికలో గాజువాక బ్రాంచికి చెందిన పలువురు అధికారులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. బ్రాంచి కార్యదర్శిగా ఏడీఈ జి.రాంబాబు, కోశాధికారిగా టి.ఎన్.వి.ఎస్.ప్రసాద్, అదనపు కార్యదర్శులుగా జె.సన్యాసిరాజు, ఎ.అనురాధ, జి.శ్రీనివాసరెడ్డి, బి.దయాళ్, ఎ.సురేష్ ఎన్నికయ్యారు. తమ అసోసియేషన్ సెంట్రల్ న్యాయ కార్యదర్శిగా సీహెచ్.విద్యా సాగర్‌బాబు, ట్రాన్స్ కో కార్యవర్గ టెలికాం ఎగ్జిక్యూటివ్ సభ్యుడిగా డి.లక్ష్మణ్ నాయుడును ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్టు రాంబాబు పేర్కొన్నారు. తమకు సహకరించిన సహచర ఉద్యోగులకు ఆయన ధన్యవాదాలు తెలిపారు.

బాలికతో అసభ్యకరంగా ప్రవర్తించిన వ్యక్తి అరెస్ట్

కూర్మన్నపాలెం : పదేళ్ల బాలికతో అసభ్యకరంగా ప్రవర్తించిన వ్యక్తిని దువ్వాడ పోలీసులు శుక్రవారం అరెస్ట్ చేశారు. ఈ మేరకు సీఐ ఎర్రంనాయుడు తెలిపిన వివరాల ప్రకారం... పెదగంట్యాడ మండలం ఇస్లాంపేట గ్రామానికి చెందిన బాలిక శుక్రవారం ఆడుకుంటుండగా అదే గ్రామానికి చెందిన తోహిదు షేక్ (30) అసభ్యకరంగా ప్రవర్తించాడు. దీంతో భయపడిన బాలిక తల్లి వద్దకు వెళ్లి విషయాన్ని చెప్పడంతో ఆమె దువ్వాడ పోలీసులకు ఫిర్యాదు చేశారు. వెంటనే పోలీసులు నిందితుడిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి దిశ పోలీసులకు అప్పగించారు.

క్లుప్తంగా

ఘనంగా పరదేశమ్మ తల్లి ఆలయ వార్షికోత్సవం



అమ్మవారిని దర్శించుకుంటున్న ఉరుకూటి రామచంద్రరావు, తదితరులు

పెదగంట్యాడ: జీవీఎంసీ 76వ వార్డు పరిధి స్వతంత్రనగర్‌లో గల పరదేశమ్మ తల్లి ఆలయ వార్షికోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ మేరకు అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. వైఎస్సార్ సీపీ గాజువాక సమన్వయకర్త ఉరుకూటి రామచంద్రరావు (చందు) అమ్మవారిని దర్శించుకున్నారు. కమిటీ సభ్యులు విశేష పూజలు చేశారు. కార్యక్రమంలో నాయకుల దొడ్డి రమణ, కామేశ్వరరావు, బాబూరావు, సిరసపల్లి కనకారావు, తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి



కాలనీవాసుల సమస్యలు తెలుసుకుంటున్న ఉరుకూటి రామచంద్రరావు

పెదగంట్యాడ: అరుణా చిన అప్పారావు కాలనీ సమస్యలు పరిష్కరిస్తామని వైఎస్సార్ సీపీ గాజువాక నియోజకవర్గ సమన్వయకర్త ఉరుకూటి రామచంద్రరావు (చందు) అన్నారు. జీవీఎంసీ 64వ వార్డు పరిధిలోని అరుణా చిన అప్పారావు కాలనీలో శుక్రవారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా స్థానికుల సమస్యలు తెలుసుకున్నారు. తాగునీటి సమస్య తీవ్రంగా వేధిస్తోందని చెప్పడంతో వెంటనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో వార్డు నాయకులు పాల్గొన్నారు.

వినాయక ఆలయ వార్షికోత్సవాలు ప్రారంభం



విశేషాలంకరణలో వరసిద్ధి వినాయకుడు

ఉక్కునగరం : స్థానిక సెక్టార్ – 3 షాపింగ్ కాంప్లెక్స్‌లోని వరసిద్ధి వినాయక ఆలయ వార్షికోత్సవాలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. వేకువజామున సుగంధ ద్రవ్యాలు, పంచామృతాభిషేకాలు చేశారు. అనంతరం స్వామికి పల్లకీ సేవ నిర్వహించారు. రుత్వికుల ఆధ్వర్యంలో కలశస్థాపన, మండపారాధన, గణపతి పూజ, పుణ్యాహవచనం, రక్షాసూత్రధారణ చేశారు. ఆలయ కమిటీ ప్రతినిధులతోపాటు అధిక సంఖ్యలో భక్తులు పూజల్లో పాల్గొన్నారు.

వెంకన్నకు క్షీరాభిషేకం

పెందుర్తి: వెంకటాద్రిపై కొలువుదీరిన వెంకటేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు మహర్తి రామానుజాచార్యుల ఆధ్వర్యంలో స్వామివారికి సుప్రభాతసేవ అనంతరం విశేష క్షీరాభిషేకం జరిపారు. పూజలు జరిపారు. భక్తులకు ప్రసాద వితరణ చేపట్టారు.

రోడ్డు నిర్మాణ పనుల పరిశీలన



బీసీ రోడ్డు పనులను పరిశీలిస్తున్న మేయర్ హరివెంకటకుమారి, ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి

పెదగంట్యాడ: రోడ్డు నిర్మాణంలో నాణ్యత పాటించాలని మేయర్ హరివెంకటకుమారి అధికారులను ఆదేశించారు. గంగవరం పోర్టు వంతెన వద్ద నుంచి కాకతీయ కూడలి వరకూ తలపెట్టిన రోడ్డు పనులను ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డితో కలసి శుక్రవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గతంలో ఈ రోడ్డు గతుకులమయం కావడంతో కొత్తగా నిధులు మంజూరు చేశామని చెప్పారు. చకచకా ఈ పనులను పూర్తి చేసి వినియోగంలోకి తీసుకురావాలన్నారు.

ఓపెన్ జిమ్ ఏర్పాటుకు వినతి

జీవీఎంసీ 75వ వార్డు పరిధి సీతానగరం ఎస్సీ కాలనీలో ఓపెన్ జిమ్ ఏర్పాటు చేయాలని వైఎస్సార్ సీపీ 75వ వార్డు నాయకులు కోరారు. ఈ మేరకు మేయర్ హరివెంకటకుమారికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ భూపతిరాజు సుజాత, నాయకులు మార్టుపూడి పరదేశి, గొందేశి శ్రీనివాస్‌రెడ్డి, వెంకటేష్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఇంటర్ పరీక్షల ప్రారంభం



చైతన్య కాలేజీ వద్ద విద్యార్థుల సందడి

పెదగంట్యాడ: ఇంటర్ ప్రథమ సంవత్సరం పరీక్షలు శుక్రవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. స్థానిక వినాయకనగర్ వుడా కాలనీలోని చైతన్య కళాశాలలో నిర్వహించిన ఈ పరీక్షలకు మొత్తం 509 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా.. 17 మంది గైర్హాజరయ్యారు. పరీక్షల సందర్భంగా కళాశాల వద్ద సందడి నెలకొంది. ఉదయం 8.30 గంటలకల్లా పరీక్ష కేంద్రానికి హాజరు కావాలని ముందుగానే విద్యార్థులకు సూచించడంతో 8 గంటల నుంచే ఈ పరీక్ష కేంద్రానికి ఒక్కొక్కరుగా వచ్చారు. విద్యార్థులతో పాటు వారి తల్లిదండ్రులు కూడా రావడంతో ఆ ప్రాంతం కోలాహలంగా మారింది.

కార్మిక సంక్షేమానికి ప్రైవేటీకరణతో నష్టం



1114వ రోజు ఉక్కు దీక్షలో మాట్లాడుతున్న నాయకులు

కూర్మన్నపాలెం : విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ అంశం కార్మిక సంక్షేమానికి చేటు అని, కార్మికులంతా కేంద్ర ప్రభుత్వం ప్రజా, కార్మిక వ్యతిరేక విధానాలను ఐక్య పోరాటాలతో ఎదుర్కొంటామని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు అన్నారు. ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద జరుగుతున్న ఉక్కు రిలే నిరాహార దీక్షలు శుక్రవారానికి 1114వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షలో సంస్థకు చెందిన పలు విభాగాల కార్మికులు పాల్గొని ఉద్యమాన్ని మరింత తీవ్రతరం చేస్తామన్నారు. దేశ సంపదను కారుచౌకగా కట్టబెడితే ఫలితంగా మౌలిక సదుపాయాల కల్పనలు కార్పొరేట్ కంపెనీల చేతుల్లోకి వెళ్లిపోయి ప్రజలపై పన్నుల భారం మరింత పెరుగుతాయన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ నిర్ణయాన్ని విరమించుకోవాలన్నారు. లేదంటే రానున్న ఎన్నికల్లో బీజేపీ ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెబుతామన్నారు. ఈ కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు, తదితరులు పాల్గొన్నారు

విద్యార్థులకు చిత్ర లేఖన పోటీలు



స్వచ్ఛంద సంస్థలు అందజేసిన బహుమతులతో విద్యార్థులు



విద్యార్థులు గీసిన చిత్రాలను ప్రదర్శిస్తున్న స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు

కూర్మన్నపాలెం: నేషనల్ సైన్స్ డే సందర్భంగా నిర్వహిస్తున్న సైన్స్ వారోత్సవాల్లో భాగంగా కణితి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సూర్యప్రకాష్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పోటీల్లో శబ్ద కాలుష్యం, భూ కాలుష్యం, నీటి కాలుష్యం, తదితర అంశాలపై చిత్ర లేఖనం పోటీలు నిర్వహించి, విజేతలకు స్వచ్ఛంద సంస్థల ద్వారా బహుమతులు అందజేశారు. అనంతరం చిత్రలేఖనం టీచర్లు బి.వి.డి.నాయుడు, అరుణ, కేవీ నూకరత్నం, భారతీ, ప్రసూన్నాంబ సైన్స్‌పై అవగాహన కల్పిస్తూ చక్కని ఉదాహరణలతో విద్యార్థులకు వివరించారు.

ఆక్రమణల తొలగింపు



ప్రభుత్వ భూమిలో ఆక్రమణలు తొలగిస్తున్న రెవెన్యూ అధికారులు

కూర్మన్నపాలెం : ప్రభుత్వ భూమి ఆక్రమణకు గురవుతుండడంతో ఆర్డీవో హుస్సేన్ రంగంలోకి దిగి గాజువాక రెవెన్యూ అధికారులను అప్రమత్తం చేశారు. దీంతో శుక్రవారం ప్రభుత్వ భూముల్లోని ఆక్రమణలను రెవెన్యూ అధికారులు తొలగించి, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. ప్రభుత్వ భూములను ఆక్రమించే వారు ఎంతటి వారైనా చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం కాకుండా ఇకపై నిరంతర నిఘా ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో గాజువాక రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

లంకెలపాలెం వాసుల కష్టాలకు చెక్

- అండర్ పాస్ వంతెన నిర్మాణానికి రైల్వే బోర్డు గ్రీన్ సిగ్నల్
- రూ.4.91 కోట్లు మంజూరు చేస్తూ ఉత్తర్వులు



లంకెలపాలెం ఫ్లై ఓవర్ వంతెన

అగనంపూడి : లంకెలపాలెం వాసుల కష్టాలు తీరనున్నాయి. రైల్వే ఫ్లై ఓవర్‌ను ఆనుకొని అండర్‌పాస్ వంతెన నిర్మించాలన్న దశాబ్దాల కల నెరవేరనుండడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. రైల్వే ఉన్నతాధికారులు, పాలక పక్షానికి అనకాపల్లి ఎంపీ సత్యవతి పలుమార్లు విజ్ఞప్తి చేయడంతో స్పందించిన రైల్వే బోర్డు అధికారులు రూ.4.92 కోట్లు మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. దువ్వాడ, తాడి రైల్వే స్టేషన్ల మధ్యలో ఉన్న లంకెలపాలెం రైల్వే క్రాసింగ్ గేటు వద్ద గంటల తరబడి వాహనాలు నిలిచిపోతుండడంతో రాంకీ ఫార్మాసిటీ ఉద్యోగులు, ఫార్మా కంపెనీల యాజమాన్యాల విజ్ఞప్తి మేరకు రైల్వే క్రాసింగ్ వద్ద వంతెన నిర్మించారు. అయితే లంకెలపాలెం మీదుగా వచ్చి పోయే వాహనదారుల కష్టాలు తీరినప్పటికీ స్థానికులకు కొత్త కష్టాలు వచ్చిపడ్డాయి. రెల్వే ట్రాక్‌కు రెండు వైపులా లంకెలపాలెం గ్రామం విస్తరించి ఉండడం, వంతెన నిర్మాణంతో క్రాసింగ్ గేట్లు ఎత్తివేయడంతో గ్రామస్తులు ఒక వైపు నుంచి మరోవైపు రాకపోకలు సాగించడానికి ఇబ్బందులు పడుతున్నారు. ఈ క్రమంలో ఫ్లై ఓవర్ వంతెనను ఆనుకొని అండర్ పాస్ వంతెన నిర్మించాలని పాలకులకు మొరపెట్టుకుంటూ వస్తున్నారు. ఇదే విషయాన్ని స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు ఎంపీ భీశెట్టి సత్యవతి దృష్టికి తీసుకెళ్లడంతో ఆమె ప్రత్యేక చొరవ తీసుకొని రైల్వే ఉన్నతాధికారులకు విజ్ఞప్తి చేశారు. అలాగే బోర్డు పాలకవర్గాన్ని సంప్రదించి సమస్యను వివరించడంతో ఎట్టకేలకు స్పందించిన అధికారులు నిధులు మంజూరు చూస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

వైఎస్సార్ సీపీ ప్రభుత్వ చొరవతో..

వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చొరవ తీసుకోవడం వల్ల రైల్వే క్రాసింగ్ వంతెన కష్టాలు తీరనున్నాయని ఆ పార్టీ 79వ వార్డు ఇన్‌చార్జి అప్పికొండ మహాలక్ష్మినాయుడు, వార్డు యూత్ అధ్యక్షుడు కర్రి నరసింగరావు, సీనియర్ నాయకులు సుందరపు అప్పారావు హర్షం వ్యక్తం చేశారు. ఎంపీ సత్యవతి చొరవ వల్ల వేలాది మంది కష్టాలు తీరుతున్నాయని పేర్కొన్నారు. అండర్ పాస్ వంతెన నిర్మాణానికి కృషి చేసిన సత్యవతికి గ్రామస్తుల తరఫున వారు కృతజ్ఞతలు తెలిపారు.

సింహగిరిపై ఘనంగా శ్రీనృసింహ హోమం



నృసింహ హోమం నిర్వహిస్తున్న అర్చకులు



శిరస్సుపై కలశంతో ప్రధానార్చకుడు, పాల్గొన్న ఈవో శ్రీనివాసమూర్తి, తదితరులు

సింహాచలం : స్వాతి నక్షత్రంను పురస్కరించుకుని సింహగిరిపై శుక్రవారం శ్రీ నృసింహ హోమం ఘనంగా జరిగింది.లోక కల్యాణార్థం శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి జన్మ నక్షత్రమైన ప్రతీ స్వాతి నక్షత్రం రోజున సింహగిరిపై నృసింహ హోమాన్ని నిర్వహిస్తున్న విషయం తెలిసిందే.దీనిలో భాగంగా ఉదయం 7గంటల నుంచి ఆలయ ప్రాంగణంలో ఉన్న కల్యాణమండపంలో హోమాన్ని విశేషంగా నిర్వహించారు. తొలుత చక్రపెరుమాళ్లను వేద మంత్రోచ్ఛరణలు, మంగళవాయిద్యాల మధ్య ఆలయంలోంచి ఊరేగింపుగా కల్యాణమండపం వద్దకు తీసుకొచ్చి అక్కడ ఉన్న హోమగుండం వద్ద వేంజేంపజేశారు.స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను శేషతల్పంపై వేంజేంపజేశారు. యాగంలో పాల్గొన్న ఉభయదాతలకు కంకణధారన చేసి ఆశీనింపజేశారు. విష్వక్సేణపూజ, పుణ్యాహవాచనం, కలశారాధన, అగ్ని కార్యం చేశారు. అనంతరం నృసింహ హోమాన్ని విశేషంగా నిర్వహించారు. హోమంలో ఉంచిన ప్రధాన కలశ ప్రధానార్చకుడు ఇరగవరపు రమణాచార్యులు శిరస్సుపై పెట్టుకుని తిరువీధిగా ఆలయంలోకి తీసుకెళ్లి స్వామివారి మూలవిరాట్‌కు సమర్పించారు. తదుపరి ఆ జలాలను భక్తులపై జల్లారు. దేవస్థానం తరఫున ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదాన్ని అందజేశారు. దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి ఈకార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రధాన అర్చకులు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, ఇరగవరపు రమణాచార్యులు, అర్చకులు చక్రవర్తి, చిన్నా తదితరులు ఈకార్యక్రమాన్ని నిర్వహించారు.

అప్పన్నకు విశేషంగా నిత్యకల్యాణం

సింహాచలం : శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి శుక్రవారం నిత్యకల్యాణం విశేషంగా జరిగింది. ఆలయ కల్యాణమండపంలో ఉదయం 9.30 గంటల నుంచి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను విశేషంగా అలంకరించి వేదికపై వేంజేపంచేశారు. విష్వక్సేణపూజ, పుణ్యాహవాచనం, కంకణధారణ, సంకల్పం, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణాన్ని నిర్వహించారు. ఉభయదాతలకు కల్యాణ అక్షింతలు, ప్రసాదం, శేషవస్త్రాలను అందజేశారు.


‘ఎంఎస్‌ఎంఈ సర్వే’ బ్యానర్ ఆవిష్కరణ



బ్యానర్‌ను ఆవిష్కరిస్తున్న జేసీ మయూర్ అశోక్

మహారాణిపేట: ఎంఎస్‌ఎంఈ సర్వే అండ్ సపోర్ట్ కార్యక్రమ బ్యానర్‌ను శుక్రవారం జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్ తన చాంబర్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ సర్వే కోసం మొబైల్ యాప్‌ను రూపొందించినట్లు తెలిపారు. ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు, అడిషనల్ డెవలప్‌మెంట్ కమిషనర్ల ద్వారా ఈ సర్వే పురోగతిని జిల్లా పరిశ్రమల కేంద్రం కలెక్టర్ ఆధ్వర్యంలో పర్యవేక్షిస్తుందని జేసీ వివరించారు. కార్యక్రమంలో జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ సిహెచ్.గణపతి, డీఎల్‌డీవో ఆర్.పూర్ణిమాదేవి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

బావిలో పడి వృద్ధురాలి మృతి



ఆదిలక్ష్మి (ఫైల్)

అక్కిరెడ్డిపాలెం : మానసిక సమస్యతో బాధపడుతున్న వృద్ధురాలు బావిలో పడి మృతి చెందింది. గాజువాక పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గాజువాక కైలాష్‌నగర్‌లో డి.ఆదిలక్ష్మి (70) తన కుమారుడు తారరాజు, కోడలు చందన రాజ్యలక్ష్మి, ఇద్దరు మనవళ్లతో కలిసి నివసిస్తోంది. ఆదిలక్ష్మి కొంత కాలంగా మానసిక సమస్యతో ఇబ్బందులు పడుతూ మందులు కూడా వాడుతోంది. శుక్రవారం మధ్యాహ్నం నుంచి ఆమె ఎక్కడికో వెళ్లిపోయిందని కోడలు, మనవలు అంతా వెతికారు. అనుమానం వచ్చి స్థానికులు ఇంటి ముందున్న నూతిలో చూడగా ఆదిలక్ష్మి మృత దేహం కనిపించింది. వెంటనే కోడలు గాజువాక పోలీసులకు సమాచారం అందించడంతో సంఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతదేహాన్ని నూతి నుంచి తీసి పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. పనుల నిమిత్తం కుమారుడు వరంగల్‌లో వుంటున్నాడు. ఈ నేపథ్యంలో కోడలు ఇచ్చిన ఫిర్యాదుతో గాజువాక పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అప్పన్న అన్నప్రసాద పథకానికి రూ.లక్ష విరాళం

సింహాచలం : శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి శాశ్వత అన్నప్రసాద పథకానికి శుక్రవారం నగరంలోని సీతంపేటకి చెందిన కరణం వెంకటేశ్వరరావు రూ1,00,116 విరాళాన్ని అందజేశారు. సంబంధిత చెక్కును సింహగిరిపై దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తికి అందజేశారు. దేవస్థానం తరుఫున దాతకు స్వామివారి ప్రసాదాన్ని, శేషవస్త్రాన్ని అధికారులు అందజేశారు. దేవస్థానం ప్రధానార్చకుడు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, సూపరింటిండెంట్ పాలూరి నరసింగరావు, సూరిశెట్టి సూరిబాబు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్‌కు సాష్టాంగ నమస్కారం



స్టీల్‌ప్లాంట్ మెయిన్ గేటు వద్ద సాష్టాంగ నమస్కారం చేస్తున్న శ్రీనివాసరావు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్‌కు ఓ ఉద్యోగి సాష్టాంగ నమస్కారం చేసి, తన విధేయతను చాటుకున్నారు. స్టీల్‌ప్లాంట్ స్టీల్ మెల్ట్ షాప్-1 విభాగంలోని కన్వర్టర్ మెకానికల్‌కు చెందిన సూరపనేని శ్రీనివాసరావు పదవీ విరమణ చేశారు. వీడ్కోలు అనంతరం ఆయన ప్లాంట్ నుంచి తన భార్యతో బయటకు వెళ్తూ మెయిన్ గేటు బయట సాష్టాంగ నమస్కారం చేశారు. తన కుటుంబం ఉన్నతికి దోహదపడిన స్టీల్‌ప్లాంట్‌కు ఇలా కృతజ్ఞత తెలపడంపై సహ ఉద్యోగులు అభినందనలు తెలిపారు.